


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### వీ.వీ.ఐ.పీ. లంటే ఎవరన్నా?

**వెరీ వెరీ ఇంపార్టెంట్** పర్సెన్స్ అని మా చిన్నతనంలో దేశనాయకుల్నీ, దేశానికి ఉపయోగపడేవారినీ, ప్రముఖ పదవుల్లో ఉండి క్రిందివారికి మేలు చేసే పబ్లిక్ సర్వెంట్స్‌నీ అనేవారు. కొన్నిసార్లు కవి గాయక కళాకారుల్ని కూడా అనేవారు. ఎవరేం అన్నా ఏ సంస్థకి ఆ సంస్థలో వీ.వీ.ఐ.పీస్ ఉంటారు... అలాగే ఏ సామాజిక వర్గానికి ఆ సామాజిక వర్గం వాళ్ళు, ఏ ఊరికి ఆ ఊరి వాళ్ళు.. ఏ పేటకి ఆ పేట ప్రముఖులు.. అసలు షార్ట్ ఫార్మ్‌లో అనడానికే వీ.వీ.ఐ.పీ అని ఇంత పెద్దగా ఉందే. ప్రతిసారీ అతి అతి ప్రముఖవ్యక్తి అనడం.. అతిగా లేదూ? సరే.. ఈ అ.అ.ప్ర.వ్య...లు కాలమానం ప్రకారం మారుతూ వచ్చారు. ఇప్పటి పరిస్థితి చూస్తే.. ఈ వీ.వీ.ఐ.పీలు కొన్ని అర్హతలతో అలరారుతున్నారు. అవేంటంటే, వీళ్ళు ఏదో ఒక ప్రముఖ రాజకీయ పార్టీకి ముఖ్యులై ఉంటారు. గతంలో ఒకటో రెండో హత్యలు.. బహిరంగంగా చేసి ఉంటారు. కొన్ని రోజులు వీళ్ళ ఫోటోలు న్యూస్ పేపర్లలో, న్యూస్ ఛానెల్స్‌లో హెడ్ లైన్స్‌గా వస్తుంది.. వెంటనే "ఫలానా వ్యక్తిని జైల్లో నిద్రిస్తుండగా చంపిన ఈ ఫలానా వ్యక్తి.. ఈ ఊళ్ళో పుట్టాడనీ, ఈ ఊళ్ళో చదువుకున్నాడనీ, దైవభక్తి కలవాడనీ, చిన్నప్పటినుండీ ప్రహ్లాద చరిత్రా, శ్రీకృష్ణలీలలూ వగైరా పురాణాలు పుక్కిట పట్టాడనీ.. లేదా ఒక స్నేహితుడికిచ్చిన మాట ప్రకారమో.. అతని కళ్ళల్లో ఆనందం చూడటానికో ఆ హత్య చేసాడు కానీ.. ఛ.. ఛ.. మనిషి మంచోడే! అనీ.. బాక్సులు కట్టి కథనాలు ప్రచురిస్తారు.

ఇంక టీ.వీ. ఛానెల్స్ అయితే తెలుగులో ఎలక్షన్ల టైంలో ఆవిర్భవించిన వాటితో కలిపి తొమ్మిది, పది నిరంతర వార్తా ప్రసార ఛానళ్ళున్నాయి. వీటికి ఫీడింగ్ ఎలాగ? అందుకే ఎక్కడ ఏ హత్య జరిగినా, ఏ చిన్న గొడవ జరిగినా, ఓ వ్యాన్, దాని నిండా సిబ్బందీ మైకులూ, కెమేరాలతో ఆ వ్యక్తి ఇంటినే కాదు, ఆ వ్యక్తి సంబంధిత వ్యక్తుల ఇళ్ళని కూడా చుట్టేస్తారు...

"ఇదిగో చూడండి.. ఈవిడ పేరు పిచ్చమ్మ.. చనిపోయిన మస్తానయ్యగారి ఇంటి వంటమనిషి. ఈ హత్య గురించి పిచ్చమ్మగారేం అంటారో విందాం?...

"పిచ్చమ్మా.. నీకు మీ అయ్యగారు నిద్రపోతుండగా ఎవరో బండరాయితో బాది చంపడం ఎలా అనిపిస్తోంది?"

పిచ్చమ్మ తలగోక్కుని పిచ్చి చూపులు చూస్తూ "మంచిగ అనిపిస్తోంది" అని నవ్వుతుంది.

"పిచ్చమ్మ ఇంకా ఆ షాక్‌లోంచి తేరుకోలేదు.. పిచ్చమ్మా మీ అయ్యగారు ఎలాంటివారు? అంటే ఆయన బిహేవియర్.. ఐమీన్ ఆయన ప్రవర్తన ఎలా ఉండేది?"

"అయ్యగారు.. మంచిగ తింటుండె.. రోజూ నీచు చెయ్యమనేటోళ్ళు.. అప్పుడప్పుడూ శనివారంనాడు కాయగూరలు. చికెన్ మాత్రం డెయిలీ సాయంత్రం కావాలంటుండె. అమ్మగారేమో పూరీ, దోశా అడుగుతుండె.. ఒక్కొక్కదినం చాపలు తెస్తుండె.."

"పిచ్చమ్మా... నువ్వింకా ఆయన జ్ఞాపకాల్లోంచి బయటపడలేదు పాపం! ఆయనకి శత్రువులు.. ఐమీన్.. ఎనిమీస్.. అదే ఆయనకి పగవాళ్ళు ఎవరైనా ఉండేవారా?"

పిచ్చమ్మ ఆలోచించి "నాకెట్ట ఎరుకైతదీ?"

"అంటే.. నువు ఇంట్లోనే ఉండేదానివిగా... నీ ముందు ఆయనని ఎవరైనా తిట్టడం, చస్తే బావుండును అనుకోవడంలాటివి... జరిగాయా?"

"ఆ! మా డ్రైవర్ రామిగాడు, ఆ గేట్ కాడ ఘూర్కా, మళ్ళీ గణేష్ చందా కొచ్చేటోళ్ళు, ఈడు సస్తే పీడా విరగడ అవుతుంది... అని అనడం చాలాసార్లు విన్నా..."

"సరే పిచ్చమ్మా.. మీ అయ్యగారి మరణం పట్ల నీ స్పందన మీ ప్రేక్షకులందరూ విన్నారు.... ఇప్పుడు మస్తానయ్యగారి హత్య గురించి స్పందించడానికి మా స్టూడియోకి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాల్‌భాషాగారూ, అధికార పార్టీ ఎమ్.ఎల్.ఏ కాశయ్యగారూ, అభ్యున్నతీ ఆడవాళ్ళ సంఘం ప్రెసిడెంట్ వింధ్యగారూ, సామాజిక స్పృహతో కూడిన రచనలు చేసిన ధీరేంద్రనాథ్ గారూ సిద్ధంగా ఉన్నారు. ఓవర్ టూ స్టూడియో....."

ఇలా మస్తానయ్య మరణం గురించి ఆ రోజంతా చర్చలూ, వార్తా కథనాలూ, స్క్రోలింగులూ... ఆ పూట గడిచిపోతుంది! పాపం.. వీళ్ళ పుణ్యమా అని ఆ హత్య చేసినవాడు క్లోజప్ ఫోటోతో ప్రముఖుడై కూర్చుంటాడు. అతను దేనికోసం ఆ హత్య చేసాడో అతనే మర్చిపోయేటంత విభిన్నమైన కథనాలు సృష్టింపబడతాయి.

రెండవరోజు "హత్య చేసిన డుకేష్‌కి ఓ ప్రియురాలుందా?" అంటూ ఓ స్క్రోలింగ్ వెళుతుంది. డుకేష్ గురించి ఈ రోజు 'కథాపీఠం' లో రాత్రి తొమ్మిదింటికి అత్యంత ఆసక్తికరమైన విషయాలు.. అని ఇస్తారు.

తొమ్మిదింటికి ఎవరో ఒక మహిళ తన మొహం మనం గుర్తుపట్టకూడదన్నట్లు మొహానికి కళ్ళనుండీ గెడ్డం వరకూ ముసుకు కప్పుకుని "డుకేష్. నాకు అప్పుడప్పుడూ మెసేజ్‌లు ఇచ్చేవాడండీ... తనకి ఒక్కో రోజు చేతులు బాగా దురదగా ఉంటాయనీ, ఆపకుండా రుద్దుకున్నా ఇంకా దురదగానే ఉంటాయనీ ఎవరో ఫ్రెండ్, హత్య చేస్తే తగ్గుతుందని అన్నాడనీ నాతో అనేవాడండీ" ఇలా అడ్డదిడ్డంగా ఆమె చెప్పినదంతా ప్రతి ఐదునిమిషాల గ్యాప్‌లో మనకి ప్రసారం చేస్తుంటారు...

ఆ తర్వాత కేసూ, పోలీస్ కస్టడీ, ఫలానా జైల్లో పెట్టారనీ, బెయిల్ మంజూరు కాలేదనీ, దాని వెనుక ఫలానా రాజకీయ పార్టీ హస్తం ఉందనీ... కొంతకాలం గడిచాకా, ఒకనాడు ఈ హత్య చేసిన 'డుకేష్'కి సడన్‌గా కుడి భుజం నెప్పో... ఎడమ కాలు వాపోలాంటి జబ్బు వస్తుంది. దాంతో ఒక ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటీ తరలిస్తారు.

అతని ఇంట్లో ఉన్నా ఇంత ఇమీడియెట్‌గా ఈ జబ్బులకి అత్యవసర వైద్యం జరగదు!

ఇంక వార్తా ఛానెళ్ళు మొత్తం ఈ అ.అ.ప్ర.వ్య. తో బాటు ఆ ఆస్పత్రి ఆవరణంతా చుట్టుముడుతారు. అప్పటికి వారం నుండీ ఏ కిడ్నీ పాడయ్యో, డయాలసిస్ కోసమో, ఏక్సిడెంట్ అయి వెన్నెముక సర్జరీ కోసమో పల్లెటూళ్ళనుండి వచ్చి ఆ ఆస్పత్రిలో చెట్ల కింద పడిగాపులు పడుతూ కళ్ళల్లో యమ భటుల్ని నింపుకుని దిక్కుతోచక తీసే శ్వాసా, ఎగదోసే శ్వాసాతో ఉన్న నిర్భాగ్యుల్ని ఆ కర్మానికి వదిలేసి, డాక్టర్లంతా ఈ వీ.వీ.ఐ.పీని ఎటెండ్ అవడానికి పరుగులు పెడతారు.

అతని ఆరోగ్య స్థితి గురించి ఛానెళ్ళు మనకి నిమిష నిమిషం బులెటిన్లు ప్రసారం చేస్తాయి.

ఈ విషయాలన్నీ తెలీని, జనరల్ నాలెడ్జి బొత్తిగా లేని ఏ పరదేశ భారతీయుడో (NRI) ఈ డుకేష్ ఆరోగ్యం గురించి స్క్రోలింగులు చూసి, అతని భార్యా పిల్లల ఇంటర్వ్యూలు విని విని..." ఎవరీ డుకేష్? అంత ప్రముఖుడా?" అంటే, మనం అతన్ని అతని అజ్ఞానాన్నీ చూసి జాలిపడి "డుకేష్ తెలీదా? ఫలానా మస్తానయ్యని ఆ మధ్యలో నిద్రపోతుండగా బండరాయితో బాది చంపలేదూ?" అంటాం. "మస్తానయ్య ఎవరూ?" అని ఆ ప.భా. మళ్ళీ ప్రశ్నిస్తాడు.

"మస్తానయ్య ఓ రియాల్టర్... చాలా ధనవంతుడు, చాపల చెరువులమ్మి, హైద్రాబాద్ శివార్లలో స్థలాలు కొని ప్లాట్లు కట్టి అమ్మి చాలా సంపాదించాడు." అంటాం.

అయితే అతన్ని హత్య చేసిన వాడికి ఇంత ఇంపార్టెన్స్ ఏవిటి? డాక్టర్లు విషాద వదనాలతో "డుకేష్ గారికి ఉదయం జైల్లో పాలు తాగి, వ్యాయామం చేస్తుండగా, కుడి భుజం కండరం నొప్పిగా అనిపించింది. వెంటనే జైలు అధికారులు మా ఆస్పత్రికి తరలించారు... పరీక్షలు చేస్తున్నాం.. ఎందువలనో చెప్పడానికి కొద్దిగా టైం పడుతుందది.. అవసరమైతే ఫారెన్ నుండి కూడా సర్జన్లని పిలిపిస్తాం.." అని చెపుతుండడం విని, ఏవీ అర్థంకాక ప్రవాసభారతీయుడు అయోమయంలో పడతాడు.

ఇలాగ ఈ వీ.వీ.ఐ.పీ.లకి ఆస్పత్రుళ్ళలో, విమానాశ్రయాల్లో, స్టార్‌హోటళ్ళలో, సినిమా హాళ్ళల్లో అన్ని చోట్లా పెద్దపీటే!

ఈ సంస్కృతి అసలు మన పురాణాల్లోనే ఉంది. రావణాసుడి తేజం గురించీ, అతని సంపద గురించీ, సుందరకాండంతా వర్ణించాడు హనుమంతుడు! తను వెళ్ళిన పనేంటీ? తను చేస్తున్నదేంటీ? ఇదేగా కోతి బుద్ధంటే?.. యజమాని పెళ్ళాన్ని ఎత్తుకుపోయిన నేరస్తుడిని గురించి అంత వర్ణనా, అంత పొగడ్తా ఎందుకంట?... ఇంక కంసుడి తెలివితేటలే తెలివితేటలండీ!... అతను చాలా ధీరుడనీ, వీరుడనీ బోలెడు చెపుతారు. ***కానీ చెల్లెలికడుపున పుట్టేవాడి వల్ల తనకి గండం ఉందని తెలిసి వాళ్ళని కారాగారంలో పడేసి, పుట్టిన ప్రతి పసికందునీ చంపేకన్నా, దేవకినీ, వసుదేవుడ్నీ చెరో సెల్‌లో పెడితే సరిపోదూ?..*** తన ప్రాణం మీదకి వచ్చేది కాదుగా!

ఇంక మన అన్నగారు రావణాసురుడి వేషం వేసినా, దుర్యోధనుడి వేషం వేసినా, ఏం వేసినా ఆ ప్రతినాయకుడు కాస్త హీరో అయి కూర్చునేవాడు! అది ఆయన గొప్పతనం!

అంతెందుకు మా చిన్నప్పుడు రిసాలాగడ్డ మీదుండే బాకర్ భాయి కూడా వీ.వీ.ఐ.పీనే. అప్పటికి రెండో మూడో మర్డర్లు చేసాడని చెప్పుకునేవాళ్ళు. అతను పాలబూత్ కెళ్ళినా, రేషన్ షాప్ కెళ్ళినా జరిగి ముందుగా క్యూలేకుండా అతన్ని వెళ్ళనీయాల్సిందే! మా ఇంట్లో వేపచెట్టు కొట్టేయాల్సొస్తే డెసిషన్ మేకింగ్ అతను చెయ్యాల్సొచ్చింది. అదంతా 'ఆత్మకథ' అనే నాకథల సంపుటిలో చదవచ్చు!

'నాయకుడు' అనే సినిమా ఏ డాన్ జీవిత కథ ఆధారంగా మణిరత్నం నిర్మించాడో మనకి తెలుసు. అందులో అతనే హీరో! కమల్‌హాసన్ నటించడం వల్లో లేక అతని జీవితం అంత రసవత్తరంగా ఉండబట్టి కానీ ఆ కేరెక్టర్‌ని నేనూ ఆ రోజుల్లో ప్రేమించేసాను!

మొన్నామధ్య ఓ పెళ్ళికెళ్ళాం. అక్కడికి ఓ సినిమా నటుడొచ్చాడు. అంతా అతన్ని ఆరాధనగా చూస్తూ, దగ్గరకెళ్ళి మాట్లాడాలని తాపత్రయ పడ్డారు. అతను మొనాటనస్ ప్లాస్టిక్ చిర్నవ్వుతో అందరికీ ఆటోగ్రాఫ్‌లిస్తున్నాడు.. ఇంతలో కలకలం... "అతనే అతనే.." అంటున్నారు. చూస్తే ఒక రౌడీ షీటర్.. ప్రముఖమైన పేరున్న రౌడీ! అంతా హీరోని వదిలేసారు. ఇతన్ని ఆరాధనగా చూస్తున్నారు. మనుషులకి భయపెట్టే వాళ్ళంటే ఆరాధన.. భక్తి అనలేం కానీ, భయంతో కూడిన ఒక అసూయ! అతనంటే అందరూ భయపడతారు కదా అని! ఈ భయపెట్టడం అంటే ప్రతివ్యక్తికీ ఎంత ఇష్టం అంటే, చిన్నప్పుడు పెద్దవాళ్ళు పిల్లల్ని 'కొడతాం' అని భయపెడతారు. స్కూల్ టీచర్స్ స్టూడెంట్స్‌ని 'ఫెయిల్' చేస్తానని భయపెడతారు. ఆఫీసర్ సబ్ ఆర్డినేట్స్‌ని 'పనిష్' చేస్తాం అని భయపెడతారు. బలం ఉన్నవాడు బలహీనుడ్ని ఎన్నో చేస్తానని భయపెడతాడు! భక్తున్నవాడిని, బాబాలూ, స్వామీజీలూ పేరుతో, దేవతలూ, మూఢనమ్మకాలు పేరుతో తాయెత్తులూ, మంత్రాలూ, వాస్తూ, అదృష్ట రాళ్ళు పేరుతో ప్రతి ఒక్కడూ భయపెడతాడు! స్టార్ హాస్పిటల్స్ వాళ్ళు జబ్బుల

పేర్లతో రకరకాల స్కానింగ్‌లూ, టెస్టులూ చేయకపోతే ప్రాణం పోతుందని జబ్బుపడ్డవారిని భయపెడతారు. 'చట్టం' పేరుతో న్యాయవాదులు, 'శిక్ష' పేరుతో రక్షక భటులు, 'కరువు' పేరుతో ధరలు పెంచి ప్రభుత్వం ప్రజల్ని.... ఇలా భయపెడుతూనే ఉంటారు. ***ఏ భయమూ ఎరుగనిది బాల్యం!... ఉయ్యాల్లో బిడ్డకి తన దగ్గరకి పామొచ్చినా, అమ్మ చెయ్యొచ్చినా ఒకేలా నవ్వుతుంది. పైకి ఎగరేస్తే భయంతో కొయ్యబారకుండా కిలకిలా నవ్వుతుంది.*** ఊహవస్తున్న కొద్దీ 'బూచాడొస్తున్నాడనీ' 'చీకటినీ', 'పోలీసు' అనీ, నిప్పనీ, నీళ్ళనీ భయం నేర్పిస్తాం. ఆ భయం ఏదో ఒక విధంగా కాటికి పోయేదాకా వెన్నాడుతూనే ఉంటుంది. ఇంతకీ భయపెట్టగలగడమే అర్హతగా మన దగ్గర నాయకులు తయారయ్యారు. ఒక్కోసారి అసెంబ్లీ సెషన్స్‌లో వాళ్ళ దూషణలు వింటూ, దుశ్చర్యలు తిలకిస్తూ ఉంటే రౌడీలకీ వీళ్ళకీ తేడా పెద్దగా తెలీడం లేదు! అందుకే వీ.వీ.ఐ.పీలు అంటే 'హడల్'గా ఉంది!

'అన్నా' అని ఒకప్పుడు ఆత్మీయతతో పిలిచేవాళ్ళు! ఇప్పుడు రౌడీలనీ, గూండాలనీ, ఇంకో రకం వాళ్ళనీ 'భయం'తో పిలుస్తున్నారు. తెలంగాణాలో పిలిచే 'అన్నా', 'అక్కా' అన్న పిలుపుతో ఆప్యాయత జాల్వారేది! ఇప్పుడు 'భయం' కనపడుతోంది.

ఈ వీ.వీ.ఐ.పీలు అప్పుడప్పుడూ సినిమాల్లోనూ కనపడుతుంటారు. సినిమా వాళ్ళూ వీళ్ళని గౌరవిస్తుంటారు.

తెలుపు శాంతికి చిహ్నం.

చాలా మటుకు వీళ్ళు తెల్లబట్టలే ధరిస్తారు. నాలుగు టాటా సుమోలు వరుసగా వెళుతున్నాయంటే సామాన్యుడు భయంగా ఏదో గొడవ జరుగుతుందని చూస్తుంటాడు.

ఎప్పటినుంచో ఉన్న 'ఫాక్షనిజాన్ని' అందంగా రంగులద్ది 'గ్లోరిఫై' చేసి చూపిస్తున్న ఘనత మాత్రం మా సినిమా వాళ్ళదే! చిన్న పిల్లలు కూడా వంటింట్లో గరిట్లూ, చల్లకవ్వాలూ తిప్పుతూ 'ఫాక్షన్' ఆటలు ఆడుతున్నారంటే ఈ సినిమాలు ఎంత ఎడ్యుకేట్ చేస్తున్నాయో చూడండి!

ఇంతకీ వీ.వీ.ఐ.పీల కేటగిరిలో ఎవరెవరొస్తారో అర్థమైందా?... వార్తా ఛానెళ్ళు 'ఆన్ ' చేసి చూడండి....